క్లుప్తంగా

పంచాయతీల్లో 'బీట్ ద హీట్'



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 'బీట్ ద హీట్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. ఇందులో జిల్లా కలెక్టర్ పాల్గొంటారన్నారు. గ్రామాల్లో మొక్కలు నాటడం, నీటి సంరక్షణ చర్యలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్లు, జన సమీకరణ అధికంగా ఉండేచోట వారిని భాగస్వాములుగా చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రతి మూడవ శనివారం సాసా పేరుతో వీటిని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డుపై మురుగునీటితో ఇబ్బందులు



ఎస్‌టీబీఎల్ థియేటర్ సమీపంలో మురుగునీటి గుంత

సబ్బవరం: స్థానిక ఎస్‌టీబీఎల్ థియేటర్ వద్ద మెయిన్ రోడ్డును అనుకుని మురుగునీరు నిలిచిపోతుండటంతో భారీ గుంత ఏర్పడింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో పాటు, ప్రధాన కూడలికి సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతం దుర్గంధభరితంగా మారింది. రోడ్డు పొడువున సీసీ డ్రైన్లు లేకపోవడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు ఇక్కడే నిలిచిపోతోంది. నిత్యం ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించే మండల పరిషత్, పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా మురుగునీరు నిలిచిపోకుండా సీసీ డ్రైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధుల సమస్యతో నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం



రాయపుర అగ్రహారంలో అర్ధంతరంగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రం

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో నిర్మాణం చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రం నిధుల సమస్యతో అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ నిర్వహించాల్సిన అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక గ్రామంలోని సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ సామాజిక భవనంలో చిన్నారులకు సరైన వసతులు లేవు. సామాజిక భవనం కాస్త ఎత్తుగా ఉండటంతో చిన్నారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సొంత భవనం శ్లాబ్ వరకు పూర్తయింది. కొద్దిపాటి నిధులతో ఈ భవనాన్ని పూర్తి చేసే అవకాశం ఉన్నా.. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టని పరిస్థితి. దీంతో ఈ భవనం ప్రారంభానికి నోచుకోకుండానే శిథిలావస్థకు చేరేలా ఉంది. సొంత భవనం లేక అవస్థలు పడుతున్న అంగన్‌వాడీలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



అర్జీలు స్వీకరిస్తున్న గండి బాబ్జీ


పెందుర్తి: నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీ అయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. పెందుర్తి సమీపంలోని సాధూ మఠం వద్దనున్న టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా, తమను సంప్రదించవచ్చని సూచించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. మొత్తం 120 అర్జీలను బాబ్జీ స్వీకరించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లేఅవుట్లు, గృహ నిర్మాణాలు ప్రారంభం
- కూటమినేతల అండతో లేఅవుట్లను కొల్లగొట్టి అక్రమంగా గ్రావెల్ తరలింపు
- అర్బన్ హౌసింగ్ లేఅవుట్లలో 800 వరకు ప్లాట్లు మాయం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్, పోలీస్ యంత్రాంగం

పేదల సొంతింటి కల సాకారమయ్యేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. సబ్బవరం మండలంలో వేసిన జగనన్న అర్బన్ హౌసింగ్ లేఅవుట్లలో నిర్మాణ పనులు నిలిచిపోవడమే కాక, గ్రావెల్ అక్రమ తవ్వకాల కారణంగా చాలా ప్లాట్ల ఆధారాలు గల్లంతయ్యాయి. అప్పటి సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించిన పైడివాడ అగ్రహారం లేఅవుట్‌లో 130 ప్లాట్ల వివరాలు కనుక్కోలేని పరిస్థితి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం కనీస చర్యలకు సాహసించని దుస్థితి.



గ్రావెల్ క్వారీలను తలపిస్తున్న లే అవుట్‌లు



అసకపల్లిలో అర్బన్ హౌసింగ్ పథకంలో చేపట్టిన గృహ నిర్మాణాలు



పట్టపగలే గంగవరం లే అవుట్‌లో గ్రావెల్ తరలిస్తున్న నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్

పేదల సొంతింటి కలకు కూటమి తూట్లు!

మండలంలో హౌసింగ్ వివరాలు

అర్బన్ హౌసింగ్ లే అవుట్లు	8
లబ్ధిదారులకు వేసిన ప్లాట్లు	34,062
లే అవుట్లలో గల్లంతైన ప్లాట్లు	800

సబ్బవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలో 8 చోట్ల అర్బన్ హౌసింగ్ లే అవుట్లను అభివృద్ధి చేశారు. పెందుర్తి నియోజకవర్గంతో పాటు విశాఖ నగర ప్రాంతానికి చెందిన లబ్ధిదారులకూ ఇక్కట్ల ప్లాట్లు కేటాయించారు. 34,062 గృహ నిర్మాణాలను శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పైడివాడ అగ్రహారంలో 9,252 గృహ నిర్మాణాలకు కేటాయించిన మెగా లేఅవుట్‌ను సాక్షాత్తూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగానే ప్రారంభోత్సవం చేశారు. విద్యుత్, నీరు, రోడ్లు వంటి మౌలిక వసతులతో శరవేగంగా పనులు చేపట్టారు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

ఆ ప్లాట్ల సంగతేంటి?

గత ప్రభుత్వంలో గృహ నిర్మాణానికి ప్రభుత్వ సాయంతోపాటు, అవసరమైన సామగ్రి అందిస్తూ శరవేగంగా పనులు జరిగాయి. కూటమి ప్రభుత్వం రావడంతో పనులకు పూర్తిగా బ్రేక్ పడింది. మరోవైపు కూటమి నేతల అండతో గ్రావెల్ మాఫియాది ఇష్టారాజ్యమైంది. కొండలు, ప్రభుత్వ భూములతో పాటు జగనన్న అర్బన్ హౌసింగ్ లేఅవుట్లలో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఈ లే అవుట్లలో రోడ్లు, ప్లాట్‌లు అనే తేడా లేకుండా భారీ యంత్రాలతో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. కొన్ని లే అవుట్లు కాలనీలుగా కాకుండా గ్రావెల్ క్వారీలను తలపిస్తున్నాయి. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు మండలంలో ఏర్పాటు చేసిన లే అవుట్లలో రోడ్లు, విద్యుత్ లైన్లతో పాటు 800 వరకూ ప్లాట్లు గల్లంతైనట్లు సమాచారం.



లే అవుట్‌లను పరిశీలిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు, తదితరులు(ఫైల్)

లే అవుట్లలో గల్లంతైన ప్లాట్లు

గంగవరం, నంగినారపాడు	600
గొల్లలపాలెం	70
పైడివాడ అగ్రహారం	130

'హౌసింగ్' చైర్మన్ ఫిర్యాదు చేసినా..

ఇటీవల రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు సబ్బవరంలోని అర్బన్ హౌసింగ్ లే అవుట్‌లను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత లే అవుట్లలో గ్రావెల్ అక్రమ తవ్వకాల ద్వారా సృష్టించిన విధ్వంసానికి నోరెళ్లబెట్టారు. గృహ నిర్మాణ శాఖ అధికారులను వెంట తీసుకెళ్లి మరీ లేఅవుట్ లెక్కలపై ఆరా తీశారు. 800 వరకూ ప్లాట్లు గల్లంతైనట్లు గుర్తించారు.

దీనిపై జిల్లా కలెక్టర్‌కు వీడియోలు, ఫోటో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. మైనింగ్, రెవెన్యూ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినా.. స్పందన మాత్రం కానరాలేదు.

లే అవుట్ల వారీగా ప్లాట్లు

పైడివాడ అగ్రహారం	9,252
గొల్లలపాలెం-1	1,192
గొల్లలపాలెం-2	5,132
గొల్లలపాలెం-3	812
గంగవరం	6,820
నంగినారపాడు	8,120
గాలిభీమవరం	1,892
అనకపల్లి	842

చోద్యం చూస్తున్న అధికారులు

గ్రావెల్ మాఫియా రెచ్చిపోతున్నా రెవెన్యూ, మైనింగ్, **పోలీస్ అధికారులు** చోద్యం చూస్తున్నారు. **కూటమి నేతల అండతో**నే గ్రావెల్ మాఫియా రెచ్చి**పోతోందన్న విమర్శలు** వినిపిస్తున్నాయి. లే అవు**ట్లలో రోడ్ల అభివృద్ధికి,** ప్లాట్‌ల ఫిల్లింగ్‌కు కాసింత **మట్టి తీసుకుందామన్నా** అంగీకరించని రెవెన్యూ, **మైనింగ్ అధికారులు** ఇంత పెద్ద ఎత్తున గ్రావెల్ **దోపిడీ జరుగుతున్నా** పట్టించుకోపోవడంపై ఆరో**పణలు వెల్లువెత్తుతున్నాయి.**

800 ప్లాట్ల ఆనవాళ్లు మిస్సింగ్

సబ్బవరం మండలంలో అర్బన్ హౌసింగ్ లబ్ధిదారుల గృహ నిర్మాణాలకు 8 లే అవుట్‌లు ఏర్పాటు చేసి 34,062 వరకూ ప్లాట్‌లు వేశాం. గ్రావెల్ తవ్వకాలతో 800 వరకూ ప్లాట్‌లు కనిపించడం లేదు. ఇటీవల హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ సైతం లే అవుట్‌లను పరిశీలించి గ్రావెల్ తవ్వకాలు, ప్లాట్‌లు గల్లంతవ్వడంపై జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. – కేవీ సూర్యారావు, అర్బన్ హౌసింగ్ డీఈ, విశాఖ జిల్లా

దోమల నిర్మూలనతోనే డెంగ్యూ నియంత్రణ



పరవాడలో దోమల నివారణపై అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది



వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పరవాడ: దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హారిక అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పరవాడలో దోమల నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ హారిక మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇంటి పరిసరాల్లోని అపరిశుభ్ర వాతావరణంలో దోమలు ఎక్కువగా పెరుగుతాయన్నారు. ఏడిస్ దోమ కాటు వల్ల వ్యాపించే డెంగ్యూ చాలా ప్రమాదకరమన్నారు. తలనొప్పి, కంటి వెనుక భాగంలో నొప్పి, కండరాల నొప్పులు, జుట్టు ఊడిపోవడం, చర్మంపై గుండ్రని ఎర్రని మచ్చలు ఏర్పడడం డెంగ్యూ వ్యాధి లక్షణాలుగా పేర్కొన్నారు. డెంగ్యూ నివారణ కోసం దోమలు రాకుండా దోమ తెరలు వాడడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు రోజుల తరబడి ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ కరిష్మా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎస్ఎన్ జానకీరాం, ఆప్తాల్మిక్ అధికారి వెంకటరావు, స్టాఫ్ నర్స్ చైతన్య, ఫార్మసిస్ట్ విజయకుమారి, ఎల్.టి.అన్నపూర్ణేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ వి.కనకప్పారావు, డాక్టర్ అబ్దుల్ ఫాతిమా బేగం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూడు పద్ధతులను పాటించండి, డెంగ్యూను నివారించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి జె.వి.గణేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు వి.సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 11 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.1.10 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

93వ వార్డులో మేయర్ పర్యటన



మేయర్ పీలాకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా

పెందుర్తి: జీవీఎంసీ 93వ వార్డులో మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం పర్యటించారు. వార్డులోని పలు ప్రాంతాలను సందర్శించి, అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల కల్వర్టులు, కాలువలు, రోడ్లు నిర్మించాలని కోరుతూ కార్పొరేటర్ రాపర్తి కన్నా మేయర్‌కు విన్నవించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. జెడ్సీ హేమావతి, అధికారులు, పలువురు నాయకులు మేయర్ వెంట ఉన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పెందుర్తి పోలీసులు



ఆత్మహత్యకు ప్రయత్నించిన సత్యం

పెందుర్తి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని, అతడ్ని రక్షించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి మండలం జంగాలపాలెం వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన బోని సత్యం(60)కు భార్య, కుమార్తె, అల్లుడితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి వీరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో చింతలపాలెనికి సమీపంలోని జంగాలపాలెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి దూకడానికి సిద్ధమయ్యాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో సమీపంలోనే ఉన్న బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ హుటాహుటిన అక్కడకు వెళ్లి, సత్యంను చాకచక్యంగా కిందికి దించేలా చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. బంధువులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని జాబిలీహిల్స్ కాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వినాయక ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఎంసెట్ హాల్‌టికెట్లతో వినాయకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ఆయా విద్యార్థుల పేరుతో అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్గం తెలియక.. తికమక!

- జాతీయ రహదారిపై పెందుర్తి వద్ద ప్రమాదకర పరిస్థితి
- ఒకవైపు రోడ్డు పూర్తికాకపోవడంతో అనకాపల్లి నుంచి ఒకే దారిలో వాహనాలు
- అకస్మాత్తుగా డివైడర్లు ఎదురుకావడంతో అయోమయానికి గురవుతున్న డ్రైవర్లు
- పరిహారం విషయంలో చిక్కుముడి వీడకపోవడంతో సమస్య జటిలం



ప్రమాదకరంగా ఉన్న డివైడర్లు



డ్రైవర్ అయోమయానికి గురవడంతో తిరగబడిన అంబులెన్స్(ఫైల్)

పెందుర్తి: జాతీయ రహదారి.. రెండుగా చీలిన ఒకే మార్గంలో ప్రయాణం.. అకస్మాత్తుగా ఎదురయ్యే డివైడర్లు.. అంతా అయోమయం.. క్షణకాలంలో ఘోర ప్రమాదాలు. ఇదీ ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారిపై పెందుర్తి వద్ద పరిస్థితి. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులతో పరిహారం చెల్లింపులో నెలకొన్న వివాదం.. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం.. కోర్టుల్లో కేసుల పర్వం వెరసి ఇక్కడ సంబంధం లేని వారు బలవుతున్నారు. అసలు జాతీయ రహదారిపై చిక్కులేంటి? ప్రమాదాలకు కారణాలేంటి? అనే కోణంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆలోచించకపోవడం గమనార్హం.

అసలేం జరిగిందంటే..

అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ సమయంలో పెందుర్తి మండలం కరకవానిపాలెం వెళ్లే మార్గం నుంచి సరిపల్లి వరకు(దాదాపు 2 కి.మీ.) రైతుల నుంచి భూముల సేకరణ చేశారు. పరిహారం విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు పలుమార్లు ఆందోళనలు చేశారు. అయినా వారికి న్యాయం జరగకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రైతులు ఆశించిన పరిహారం ఇచ్చేందుకు మార్గదర్శకాలను రూపొందించారు. అయితే జిల్లా అధికారులు ప్రతిపాదించిన పరిహారం విషయంలో జాతీయ రహదారుల అథారిటీకీ–జిల్లా అధికారులకు మధ్య వివాదం రాజుకుంది. ఒకరిపై ఒకరు కోర్టుకు వెళ్లారు. దీంతో రైతులకు పరిహారం అందజేయక, మిగిలిన రోడ్డును పూర్తిచేయకుండా ఆపేశారు.

గాల్లో వాహనదారుల ప్రాణాలు

ఈ క్రమంలో రాంపురం వద్ద అనకాపల్లి నుంచి ఆనందపురం వెళ్లే మార్గం పూర్తిగా మూసివేశారు. రాంపురం నుంచి పెందుర్తి పెద్ద చెరువు వరకు అనకాపల్లి నుంచి వస్తున్న రోడ్డును రెండు భాగాలుగా చేశారు. దీంతో ఇరుకు రోడ్డులో అనకాపల్లి నుంచి వాహనాలు పెందుర్తి మీదుగా ఆనందపురం వైపు వెళ్లాల్సి వస్తుంది. అయితే పెందుర్తి పెద్దచెరువు వద్ద రోడ్డు వాహనాలను అకస్మాత్తుగా మళ్లించాల్సిన స్థితిలో డ్రైవర్లు అయోమయానికి గురై, ఎదురుగా ఉన్న డివైడర్లను ఢీకొంటున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక్కడ గత ఎనిమిది నెలల వ్యవధిలో దాదాపు 30 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇందులో 10 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో క్షతగాత్రుల య్యారు.

పట్టించుకునే నాథుడేడీ..

వాస్తవానికి జాతీయ రహదారి పనులు ప్రారంభం నుంచి ఇక్కడ వివాదం ఉంది. దీని పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన యంత్రాంగం పరస్పరం కోర్టు కేసుల వరకు వెళ్లారు. సమస్య మరింత జటిలమై రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీనిపై ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు కాస్త దృష్టి సారించి, కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐఎన్‌టీయూసీ నేత ప్రభాకర్‌రెడ్డికి ఘన నివాళి



ప్రభాకర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్, తదితరులు

పెందుర్తి: గుండెపోటుతో మృతి చెందిన స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు గొందేశి ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఘన నివాళులర్పించారు. 77వ వార్డు పెదగంట్యాడలో ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్లాంట్ కార్మికుల సమస్యల కోసం ప్రభాకర్‌రెడ్డి చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెదగంట్యాడ: పౌష్టికాహారం తీసుకుంటే తల్లులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మి అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.